


# నవభూమి కరీంనగర్

అనుబంధం

26 సెప్టెంబర్,2024 గురువారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


# కొనుగోళ్లకు రెడీ



**జగిత్యాల, –నవభూమి:** వానాకాలంలో సాగైన వరి ధాన్యం సేకరణకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ధాన్యం చేతికి రావడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ కొనుగోళ్లపై జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు ప్రణాళికలు రూపొందించి ముందస్తు జాగ్రత్తలు తీసు కుంటున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఇటీవల సంబందిత శాఖల అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించి కొనుగోళ్లపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ఆలస్యంగా వరి నాట్లు వేసుకోవడంతో అక్టోబర్ రెండు, మూడు వారాల్లో కోతలు ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ చివరి వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 5.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల పెంపు, లారీల సరఫరా, గన్ని సంచులు త దితర ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు.జిల్లాలోని కొనుగోలు కేంద్రాలు...జిల్లా వ్యాప్తంగా 421 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడా నికి అధికారులు నిర్ణయించారు. ఇందులో 133 కేంద్రాలు ఇందిరా కాంతి పథం మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయనుండగా, 277 కేంద్రాలు సహకార శాఖ ద్వారా, ఒకటి మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు గానూ 1.43 లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా, ప్రస్తు తం జిల్లాలో 23 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉన్నాయి. మరో 1.20 లక్షల గన్నీ సంచులను కొనుగోలు చేయడానికి పౌరసరఫరా శాఖ అ ధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.ఏ మాసంలో ఎంత ధాన్యం..జిల్లా వ్యాప్తంగా 5.73 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేయగా, ఇందులో అక్టోబర్‌లో 57 వేల మెట్రిక్ టన్నులు, నవంబరులో 1.70 లక్షల మెట్రిక్ టన్నులు, డిసెంబ రు లో 2.87 లక్షల మెట్రిక్ టన్నులు, జనవరిలో 57 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా వేశారు.జిల్లాలో 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగు..జిల్లాలో ప్రధానంగా వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం గత ఏడాది కంటే పెరిగింది. 2021–22 వానాకాలం సీజన్‌లో 2,92,855 ఎకరాల్లో వరి సాగు చేయగా 2022–23 వానాకాలం సీజన్‌లో 3,05,562 ఎకారాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుత వా నాకాలం సీజన్‌లో 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా దొడ్డు రకం వరి సాగు కావడంతో ధాన్యంలో 75 శాతం కొ నుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో 3.86 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం, 1.86 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావచ్చని అంచనా వేస్తున్నారు.ఆలస్యంగా వరి నాట్లు..జిల్లాలో కొన్నేళ్లుగా వానాకాలంలో ఎక్కువగా వరి సాగు చేస్తున్న రైతు లు ప్రస్తుత సీజన్‌లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఆలస్యంగా వరి నాట్లు వేశారు. 75 శాతం దొడ్డు రకం, 25 శాతం సన్నరకం వరి సాగైన ట్లు అంచనాలున్నాయి. సన్నరకం ఇంటి అవసరాల కోసమే నిల్వ ఉంచు కోనున్నారు. యాసంగిలో 95 శాతం దొడ్డు రకం సాగుంటుంది. దిగుబడి వచ్చిన ధాన్యంలో 90 శాతం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి వస్తుంది. జూలై, ఆగస్టు మాసాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా మొదట్లో నా ట్లు వేసుకున్న పంట కొట్టుకపోవడం, ఇసుక మేటలు వేయడంతో రెండో సారి నారు పోసుకొని ఆగస్టు నెలాఖరు వరకు నాట్లు వేశారు. సాగు ఆల స్యం కావడంతో స్వల్పకాలిక దొడ్డు రకాల వరిసాగుకు ఎక్కువగా మొగ్గు చూపారు. దీంతో ఈ వానాకాలం సీజన్‌లో గతంలో కంటే ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశం ఉంది.పెరిగిన మద్దతు ధర...గత సీజన్‌లో ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ. 2,203, బీ గ్రేడ్ సాధా రణ రకం వద్దకు రూ. 2,183 చెల్లించారు. ప్రస్తుత యేడాది ఏ గ్రేడ్ ధా న్యానికి క్వింటాలుకు రూ. 2,320, సాధారణ బీ గ్రేడ్ రకానికి రూ. 2,300 ధర నిర్ణయించారు. గత యేడాది కంటే అదనంగా మద్దతు ధర పెరి గింది. ధాన్యంలో 17 శాతం కంటే తక్కువ తేమ ఉన్నప్పుడే మద్దతు ధర లభిస్తుందని అధికారులు అంటున్నారు. రైతులు ధాన్యం బాగా ఆరబోసి కేంద్రాలకు తీసుకొస్తే తూకం వేయడంలో ఇబ్బందులు ఉండవని అధికారులు అంటున్నారు.పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్ ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరించడానికి అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే ఇందుకు అవసరమైన అంచనాలు రూపొందించాము. సీజన్‌లో దిగుబడి కానున్న వరి ధాన్యం, ఏర్పాటు చేయాల్సిన కేంద్రాలు, ధాన్యం తరలింపునకు వా హనాలు, నిల్వలకు గోదాములు, హమాలీలు, గన్నీ సంచులు తదితర ఏ ర్పాట్లపై దృష్టి సారించాము. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాము.

## విజయ దశమిని వైభవంగా

# నిర్వహిస్తాం



**తిమ్మాపూర్, –నవభూమి:** విజయ దశమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మహాత్మానగర్ ఎల్ఎం డీ కాలనీలోని రాంలీల మైదానంలో నిర్వహించనున్న విజయ దశమి ఉత్సవాలకు సంబందించిన పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈసారి వివిధ శాఖల ఉద్యోగులను కూడా ఈ వేడుకల్లో భాగప్వాములను చేస్తున్నామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించేందుకు ఉత్సవ కమిటీకి బాధ్యతలు అప్పగించా మన్నారు. ఉత్సవ కార్యనిర్వాహక కమిటీ కన్వీనర్‌గా కుంట రాజేందర్‌రెడ్డి, కోకన్వీనర్‌గా గవ్వ రాజేందర్‌రెడ్డి, సభ్యులుగా కేతిరెడ్డి ఎల్లారెడ్డి, గూడ కమలాకర్, గవ్వ రవీందర్ రెడ్డిని ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, గోపు మల్లా రెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, కాలువ మల్లేశం, పోలు రాము, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, పోలు రమేశ్, నోముల అనిల్, ఊట్కూరి వెంకట రమణారెడ్డి, బుధారపు శ్రీనివాస్, సిరిగిరి కొండల్ రావు, ఇనుకొండ వీరా చంద్రారెడ్డి పాల్గొన్నారు.రూ. 10వేల ఆర్థిక సహాయం మానకొండూర్: మానకొండూర్ గ్రామానికి చెందిన కోండ్ర ప్రహర్ష (24) అనే వివాహిత వ్యవసాయబావిలో దూకి సోమవారం ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రహర్ష కుటుంబసభ్యులను పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్‌గౌడ్, జిల్లా కార్యదర్శి గసిగంటి సంపత్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జడల రమేశ్, మండల యూత్ అధ్యక్షుడు కోండ్ర సురేష్ ఉన్నారు.

# పాలన సాగేదెట్లా?




2



2

## రాజన్న హుండీ ఆదాయం రూ.1.44 కోట్లు



**వేములవాడ, -నవభూమి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీని అధికారులు మంగళవారం లెక్కించారు. 12 రోజులకు రూ. 1,44,06,154 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. బంగారం 710 గ్రాములు, వెండి 14 కిలోలను భక్తులు కానుకల రూపంలో స్వామివారికి సమర్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం పరిశీలకుడు సత్యనారాయణ, ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ మహిళలు పాల్గొన్నారు.

## జాడలేని 'యాక్షన్ ప్లాన్'



**పెద్దపల్లి-నవభూమి:** నిరుద్యోగ దళిత యువతీ, యువకులు స్వయంఉపాధి పథకాలకు నోచుకోవడం లేదు. ప్రతి ఏటా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 'యాక్షన్ ప్లాన్' రూపొందించి ఆ మేరకు లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేయగా, కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా వాటి గురించి పట్టించుకోవడం లేదు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై నాలుగు మాసాలు గడిచినా కూడా ఇప్పటివరకు యాక్షన్ ప్లాన్‌కు దిక్కు లేదు. గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు విడుదల చేయాల్సిన 17 కోట్ల 24 లక్షల 2వేల 831 రూపాయల సబ్సిడీని విడుదల చేయకపోవడంతో యూనిట్లు గ్రౌండింగ్ కావడం లేదు. ఎంపికైన లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 2018 వరకే సక్రమంగా అమలు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాలు, పట్టణాల్లో ఉండే దళిత యువతీ యువకులు స్వయం ఉపాధి పనులు చేసుకునేందుకు స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేది. అలాగే వ్యవసాయ పరంగా బావుల తవ్వకం, బోర్లు వేయడానికి, విద్యుత్ కనెక్షన్లు, మోటార్ల కొనుగోలుకు, పాడి గేదెల కొనుగోలు, భూమి కొనుగోలుకు ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ అందించేవాళ్లు. 50 శాతం నుంచి 100 శాతం వరకు పథకాలను బట్టి సబ్సిడీని నిర్ధేశిస్తారు. సబ్సిడీ తక్కువగా ఉన్నప్పుడు లబ్ధిదారుడి వాటా, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి, సబ్సిడీని అందజేసి సంబంధిత యూనిట్‌ను గ్రౌండింగ్ చేస్తారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2018 వరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రతి ఏటా యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి పథకాలను అమలుచేశారు. ఆ తర్వాత సక్రమంగా అమలు చేయలేదు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 300 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. ఆ యూనిట్ల విలువ 6 కోట్ల 56 లక్షల 80 వేలు కాగా, ఇందులో ప్రభుత్వ సబ్సిడీ 4 కోట్ల 38 లక్షల 97 వేల రూపాయలు, బ్యాంకుల ద్వారా 2 కోట్ల 17 లక్షల 83 వేల రూపాయల రుణాలు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం సబ్సిడీ సొమ్మును విడుదల చేయకపోవడంతో ఆ యూనిట్లు గ్రౌండింగ్ కాలేదు. ఇప్పటికీ కూడా సదరు లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 507 యూనిట్లకు అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆ యూనిట్ల విలువ 19 కోట్ల 66 లక్షల 26 వేల 129 రూపాయలు కాగా, ప్రభుత్వ సబ్సిడీ 12 కోట్ల 21 లక్షల 7 వేల 831 రూపాయలు, బ్యాంకులు ద్వారా 7 కోట్ల 45 లక్షల 18 వేల 298 రూపాయల రుణాలు ఇవ్వాల్సి ఉంది. అలాగే ఇదే ఏడాది అప్పటి ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాడి గేదెల పెంపకాన్ని ప్రోత్సహించాలనే చొరవతో జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి పాడి గేదేల పెంపకాన్ని ప్రారంభించారు. వెయ్యి మంది మహిళా లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేసి గ్రౌండింగ్ చేయగా, ఎంపిక చేసిన 457 మంది లబ్ధిదారుల యూనిట్ల విలువ 9 కోట్ల 14 లక్షలు కాగా, ప్రభుత్వ సబ్సిడీ 6 కోట్ల 39 లక్షల 80 వేలు, బ్యాంకుల ద్వారా 2 కోట్ల 74 లక్షల 20 వేల రుణాలు ఇవ్వాల్సి ఉంది.

# పాలన సాగేదెట్లా?




**సిరిసిల్ల: -నవభూమి:** పరిపాలన సౌలభ్యం.. ప్రజల చెంతకు అధికారులు.. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచేలా పరిపాలన వికేంద్రీకరణ కోసం జిల్లాలను ఏర్పాటు చేశారు. విభజనతో సరిపడా అధికారులు లేక పలు స్థానాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. అక్టోబరుతో జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లు పూర్తవుతాయి. కొన్ని శాఖలకు జిల్లా అధికారుల పోస్టులు లేవు. ఇన్‌ఛార్జులతో కొనసాగిస్తున్నారు. ఫలితంగా అధికారులకు పనిభారం.. విధుల నిర్వహణ సవాల్‌గా మారుతోంది. ఇటీవలే ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ముగిసింది. అయినా ఖాళీలు మాత్రం అలాగే ఉండటంతో పరిపాలనపై ప్రభావం పడుతుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలన్నా.. అభివృద్ధి పరుగులు పెట్టాలన్నా జిల్లా అధికారుల పాత్ర కీలకం. ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖలకు జిల్లా అధికారుల పోస్టులే లేవు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సీనియర్ అసిస్టెంటుకు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ లేదు. కార్యకలాపాలు కరీంనగర్ నుంచే కొనసాగుతున్నాయి. మైనార్టీశాఖను భూసేకరణ విభాగం ప్రత్యేక కలెక్టర్‌కు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల బాధ్యతలను ఆయా శాఖల్లోని సీనియర్లకు అప్పగించారు. కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి సకాలంలో విడుదల కాక ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీనికితోడు జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ అధికారులిద్దరు బదిలీపై వెళ్లారు. గ్రామీణాభివృద్ధి అధికారికి డీపీవో, డిప్యూటీ సీఈవోకు డీఎల్‌పీవోలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో ఈనెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు స్వచ్ఛతాహీ సేవా రెండో విడత కార్యక్రమం ప్రారంభమైంది. దీనిపై పర్యవేక్షణ లేక అంతంత మాత్రంగానే సాగుతోంది. రహదారులు, భవనాలశాఖ ఈఈ మేలో పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి కరీంనగర్ ఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీనికితోడు జిల్లాలో నలుగురు డీఈలకు ఇద్దరు, 12 మంది జేఈలకు ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఇటీవల వర్షాలకు 29 కిలోమీటర్ల మేర రహదారులు శిథిలమయ్యాయి. ఐదు చోట్ల వంతెనలు దెబ్బతిన్నాయి. వీటికి శాశ్వత మరమ్మతులకు రూ. 55 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లా అధికారి లేక దస్త్రం ముందుకు కదలడం లేదు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలికల కమిషనర్లు ఉన్నత ఉద్యోగాల పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సెలవుపై వెళ్లారు. వీరి బాధ్యతలను మేనేజర్‌లు చూస్తున్నారు. జిల్లా ఆవిర్భావం నుంచి మెప్మాకు సిరిసిల్ల కమిషనర్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్‌లో తూనికలు, కొలతలు, డ్రగ్స్ కంట్రోల్, లీడ్ బ్యాంకుకు సంబంధించిన కార్యాలయాలు లేవు. ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులపై కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని 'ఈనాడు' సంప్రదించగా జిల్లా అధికారుల పోస్టింగ్‌లు రాష్ట్రస్థాయిలోనే జరుగుతాయని తెలిపారు. జిల్లాకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ పోస్టు మంజూరు కాలేదు. మొన్నటి వరకు ఇన్‌స్పెక్టర్‌కే ఏడీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఇతను బదిలీ కావడంతో సిద్దిపేటలోని ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. ఇప్పటికే జిల్లాలో ఐదు మండలాలకు సర్వేయర్లు ఖాళీగా ఉన్నారు. సర్వే కోసం మూడు వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సిద్దిపేట జిల్లా మత్స్యశాఖ అధికారి ఈ జిల్లా బాధ్యతలు చూస్తున్నారు. జిల్లాలో ప్రజారోగ్యశాఖ పోస్టు ఉన్నప్పటికీ సిరిసిల్ల పురపాలక డీఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. వేములవాడ పురపాలక పట్టణ ప్రణాళిక అధికారికి వీటీఏడీఏ కార్యదర్శి, జిల్లా పట్టణ ప్రణాళిక అధికారి బాధ్యతలు కూడా చూస్తున్నారు.

## 18 తులాల బంగారు ఆభరణాలు మాయం

**కరీంనగర్ -నవభూమి:** ఇంట్లోని రూ. 3.50 లక్షలు అలాగే ఉన్నా.. 18 తులాల బంగారు ఆభరణాలు మాత్రం అపహరణకు గురైన ఘటన మిస్టరీగా మారింది. కరీంనగర్ రెండో ఠాణా పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్న పిట్టల ప్రశాంత్ గ్రానేట్ క్వారీ సంస్థ కొనసాగిస్తున్నారు. అతడు మంగళవారం క్వారీ వద్దకు వెళ్లగా ఆయన భార్య లహరీ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. ఇంటికి వచ్చి తాళం తీసి లోనికి వెళ్లగా మరోవైపు ఉన్న తలుపులు తెరచి ఉన్నాయి. అనుమానంతో బీరువాలో చూడగా 18 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బీరువాలో మరోవైపున రూ. 3.50 లక్షల నగదు భద్రంగానే ఉంది. ఈ మేరకు సమాచారం అందుకున్న నగర ఏసీపీ నరేందర్, రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్యాంకు ఖాతాల నుంచి రూ. 20 లక్షలు మాయం కేసును ఛేదించిన కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: నమ్మకంగా మెదిలి బ్యాంకు ఖాతాల నుంచి రూ. 20 లక్షలు కాజేసిన ఘటన ఇది. రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని నీటిపారుదల శాఖలో ఎం.డి.సమీయుద్దీన్ పర్యవేక్షణాధికారిగా పని చేసి 2013లో ఉద్యోగ విరమణ పొందారు. అతడు అవివాహితుడు. సమీయుద్దీన్ ఇద్దరు చెల్లెళ్లకూ వివాహం కాలేదు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత వచ్చిన కొంతడబ్బును ఓ బ్యాంకు ఖాతాలో, మరికొంత నగదును తన సోదరి సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. సమీయుద్దీన్ పని చేస్తున్న నీటిపారుదల శాఖలోనే జహంగీర్ జూనియర్ అసిస్టెంట్గా పని చేసేవారు. ఈ క్రమంలో జహంగీర్, సమీయుద్దీన్ కుటుంబాల మధ్య పరిచయం ఏర్పడింది. సమీయుద్దీన్ 2022లో మృతి చెందారు. అతడి బ్యాంకు ఖాతా, తన సోదరి సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాల వివరాలు జహంగీర్ తెలుసుకున్నాడు. మూడు నెలల కింద కరీంనగర్‌లో జిమ్ నిర్వాహకుడైన మహ్మద్ ఆసిఫ్ పాషాకు విషయం తెలిపి అతడితో చేతులు కలిపాడు. సమీయుద్దీన్ వినియోగించిన చరవాణి నంబర్‌ను ఆసిఫ్ పాషా రద్దు చేయించి తన పేరు మీదకు మార్చుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానంతో సమీయుద్దీన్, సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాల్లో ఎంత నగదు ఉందో తెలుసుకున్నారు. సబీహా సుల్తానా బ్యాంక్ ఖాతాలో నిల్వ ఉన్న రూ. 20,18,557 నగదు ఉన్నట్లు గుర్తించారు. అవసరాల మేరకు యూపీఐ ద్వారా విడుతల వారీగా రూ. 20 లక్షల మేర మళ్లించుకున్నారు. నెల కింద సబీహా సుల్తానా బ్యాంకు వెళ్లి రూ. లక్ష డ్రా చేసుకున్నారు. మిగతా నిల్వ ఉన్న నగదుపై విచారించగా ఖాతాలో కేవలం రూ. 4 లక్షలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆమె కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏసీపీ నరసింహారెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసును ఛేదించారు. నేరంలో కీలకపాత్ర పోషించిన ఆసిఫ్ పాషాను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ. 18 లక్షల నగదును రికవరీ చేశారు. జహంగీర్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.



## ఆదాయం సరే.. సౌకర్యాలేవీ?



**కరీంనగర్ -నవభూమి:** టీజీఎస్ ఆర్టీసీ ఒకవైపు ప్రజా రవాణాను కొనసాగిస్తూనే మరోవైపు ఆదాయం పెంచుకోవడంలో భాగంగా లాజిస్టిక్ (పార్సిల్ బుకింగ్) సేవల్లోకి అడుగు పెట్టింది.కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా నిత్యం వేలాది పార్సిళ్లు బుక్ కావడంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు పార్సిళ్లు బస్సుల ద్వారా వస్తుంటాయి. వీటి ద్వారా ఆర్టీసీకి ఆదాయం కూడా బాగానే వస్తోంది. కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బుకింగ్ కేంద్రానికి రోజు రూ.లక్షకుపైగా ఆదాయం వస్తుంది కానీ.. సరైన సౌకర్యాలు లేక వినియోగదారులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.నిత్యం 900ల పార్సిళ్లు..కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన లాజిస్టిక్ బుకింగ్ కేంద్రానికి మంచి ఆదరణ లభిస్తోంది. బుకింగ్ చేసిన పార్సిళ్లు, కవర్లు రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల నుంచి 48 గంటల్లో చేరే అవకాశం ఉండటంతో వ్యాపారులు, ఇతరులు ఆర్టీసీ బుకింగ్ కేంద్రాల ద్వారానే తమ పార్సిళ్లను పంపిస్తున్నారు. దీంతో సంస్థకు ఆదాయం కూడా బాగానే వస్తోంది. కరీంనగర్ ప్రయాణ ప్రాంగణంలో మూడు కౌంటర్లు 24 గంటలు పనిచేస్తాయి. నిత్యం 900ల పార్సిళ్లు బుక్ చేయడంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి 900ల పార్సిళ్లు ఇక్కడకు వస్తుంటాయి.గమ్యం చేరుకోవడంలో ఆలస్యం వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పార్సిళ్లు సకాలంలో వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జేబీఎస్‌లో ఉదయం బుక్ చేసిన పార్సిల్ రావడానికి ఒక్కోసారి రెండు రోజులు పడుతుందని ఓ వినియోగదారుడు తెలిపారు. సరైన పర్యవేక్షణ కూడా లేదనే ఆరోపణలున్నాయి. బుకింగ్ కేంద్రానికి వచ్చే పార్సిళ్ల సంఖ్య పెరిగిపోవడంతో వాటిని భద్రపరచడానికి స్థలం సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని తీసుకోవడానికి వచ్చిన వారికి అవి ఎక్కడ ఉన్నాయో వెతికి ఇవ్వడం సిబ్బందికి కష్టంగా మారింది. సమస్యలపై లాజిస్టిక్ మేనేజర్ రామారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. సెక్యూరిటీ సిబ్బంది కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. స్థలం కొరత ఉందని.. సమస్యను ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.బుకింగ్ కేంద్రాలు 3 దాయం రూ.1.50 లక్షలు ఒకరోజు వచ్చే పార్సిళ్లు 900 బుకింగ్ అవుతున్నవి 900 పని చేస్తున్న సిబ్బంది 26 మంది ప్రధాన సమస్యలివి..మూడు బుకింగ్ కేంద్రాల నిర్వహణలో భాగంగా పార్సిళ్లను స్వీకరించడం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాటిని భద్రపరచ్చడం, వినియోగదారులకు అందించడం వంటి పనుల కోసం ఆర్టీసీ ఉద్యోగులు 13, పొరుగు సేవల సిబ్బంది 13 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.24 గంటలు సేవలు అందించే కౌంటర్లు కావడంతో సిబ్బంది సరిపోవడం లేదు.పనిభారం పెరిగి ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారని.. సిబ్బందిని కేటాయించమని కోరినా.. సెలవులు అడిగినా ఇవ్వని పరిస్థితి ఉందని ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు పార్సిళ్లను తీసుకోవడానికి నిత్యం వందలాది మంది లాజిస్టిక్ కేంద్రానికి వస్తుండగా.. అక్కడ వస్తువుల రక్షణ చర్యలు అంతగా లేవు.సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతో కేంద్రం లోపలకు ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికే కొన్ని పార్సిళ్లు పోయిన ఘటనలు కూడా జరిగాయి. సెక్యూరిటీ సిబ్బందిని నియమించడంతోపాటు కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

## సన్నాలపై మక్కువ

**సిరిసిల్ల -నవభూమి:** వానాకాలం పంటల సాగులో అన్నదాతలు వరి వైపే మొగ్గు చూపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతంలో పత్తి సాగునే ప్రధానంగా భావించినా రైతులు సమృద్ధిగా కురుస్తున్న వర్షాలు, ప్రాజెక్టులోకి నీళ్లు, భూగర్భ జలాల పెరుగుదలతో పత్తి సాగు సగానికి పడిపోగా వరి రికార్డు స్థాయిలో పండిస్తున్నారు. ?ధాన్యం దిగుబడి రైతులకు ఆశాజనకంగానే మారింది. ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచే ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యానికి మద్దతు ధరపై 500 రూపాయలు బోనస్ ఇస్తామని ప్రకటించడంతో జిల్లాలో కొంత మేరకు రైతులు సన్నరకం సాగుపై ఆసక్తి చూపారు. జిల్లాలో కేవలం దొడ్డురకం మాత్రమే రైతులు పండించేవారు ఈసారి బోనస్ రైతుల్లో జోష్‌ను నింపిందని చెప్పుకోవచ్చు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి 1.80 లక్షల ఎకరాలు, పత్తి 49,332 ఎకరాలు సాగు చేశారు. మిగతా పెసర, కందులు, ఇతర పంటలు వేసుకున్నారు.

# పేరుకే కమిటీలు..
# పరిష్కారం కాని సమస్యలు

**హుజూరాబాద్‌-నవభూమి:** పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లాలోని పురపాలికలు, నగరపాలికల్లో ఏర్పాటుచేసిన వార్డు కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి.అభివృద్ధి పనుల్లో పాలకవర్గం, అధికార యంత్రాంగంతోపాటు ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంతో 2020 ఏప్రిల్‌లో గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. నాలుగేళ్లు దాటినా ఈ కమిటీల సలహాలు, సూచనలు తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. ఫలితంగా అభివృద్ధి పనుల్లో వీరి భాగస్వామ్యం పూర్తిగా కొరవడింది.401 వార్డులు.. 1844 కమిటీలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 14 పురపాలికలతోపాటు.. కరీంనగర్, రామగుండం నగరపాలికల్లోని 401 వార్డుల్లో 1844 కమిటీలను ఏర్పాటుచేశారు. ఇందులో 27,660 మంది సభ్యులున్నారు. ఒక్కో వార్డుకు నాలుగు కమిటీల చొప్పున ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులతో.. యువకులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిపి వీటిని ఏర్పాటు చేశారు.సమావేశాల ఊసే లేదు..ప్రతి వార్డుకు కమిటీలను నియమించి సభ్యులకు లక్ష్యాలు నిర్దేశించారు. అయితే ఏర్పాటు సమయంలో చూపిన ఆసక్తి.. ఆ తర్వాత పూర్తిగా కొరవడింది. వార్డు కమిటీ సభ్యులతో రెండు, మూడు నెలలకోసారి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి.. చేపట్టాల్సిన పనులు, సమస్యలపై చర్చించాలి. అనంతరం అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా పనులను ఎంపిక చేసి వార్డు అధికారి ద్వారా పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలి. కమిషనర్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాల్సి ఉంది. అయితే ఒక్కసారి కూడా కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించడం, అభివృద్ధి పనుల ప్రణాళికలు రూపొందించిన దాఖలాలు లేవు. ఫలితంగా సమస్యలు వెంటాడుతున్నాయి.హుజూరాబాద్‌లోని పద్మానగర్‌లో బురద రోడ్డుతో అవస్థలు ఈ ప్రభుత్వం అయినా పట్టించుకునేనా? ఆయా వార్డుల్లో వనమహోత్సవం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అక్రమ నిర్మాణాల గుర్తింపు తదితర అంశాలపై పాలకవర్గం, అధికార యంత్రాంగం ఈ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని ఆయా పనులను చేపట్టాల్సి





ఉంటుంది. కానీ నాలుగేళ్లుగా ఈ కమిటీల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాకనైనా వీటికి ప్రాధాన్యత ఇస్తుందని ఆశించినా.. ఆ దిశగా చర్యలు మాత్రం చేపట్టలేదు. అసలు వార్డు కమిటీలు ఉన్నాయనే విషయం కూడా చాలామందికి తెలియదంటే వీటి ప్రాధాన్యత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# లీకేజీల ప్రవాహం

**సుభాష్‌నగర్:-నవభూమి:** నగరపాలక సంస్థ పరిధిలో రోజూ ఉదయం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు రిజర్వాయర్ల వారీగా నీటి పంపిణీ జరుగుతోంది.పైపులైన్ల గుండా నీరు వెళ్తుండగా.. ప్రతి వీధికి కంట్రోల్ వాల్వులు తిప్పాల్సి ఉంటుంది. రోజూ రెండుసార్లు తిప్పుతుండటంతో వాటికి సంబంధించిన రాడ్ అరిగిపోయి నీరు రహదారులపై ప్రవహిస్తోంది. అయినప్పటికీ మరమ్మతులు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. నీటితో ఆ ప్రాంతం దుర్గంధంగా మారడం, గుంతలు పడటంతో రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. తద్వారా నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. పైపులైన్లు పగిలి..నగరంలోని స్మార్ట్ రహదారులతో పాటు ఆర్అండ్‌బీ రోడ్లపై పైపులైన్లు పగిలి పోతున్నాయి. సప్తగిరికాలనీ జాతీయ రహదారిపై మూడు చోట్ల పైపు పగలడంతో భారీగా శుద్ధ నీరు వృథా అవుతోంది. స్మార్ట్ రోడ్లు కొత్తగా వేయడంతో పగలకొడితే మరమ్మతులు చేయడం కష్టంగా మారడంతో ఏం చేయాలో తెలియక అలాగే వదిలేస్తున్నారు.విడిభాగాలు లేక..రోజు విడిచి రోజు నీటి సరఫరా చేసిన సమయంలో కంట్రోల్ వాల్వులు ఎక్కువగా పాడయ్యేవి కావు. మూడేళ్లుగా రోజు నీటి సరఫరా చేస్తుండటంతో మూడు నెలలకు ఒకసారి వాల్వులు చెడిపోతున్నాయి. రాడ్స్‌తోపాటు ఇతర విడిభాగాలు లేకపోవడంతో లీకేజీల పరిష్కారానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండో రకం వాల్వులు కొనుగోలు చేయకుండా ముందుగానే అంచనాల్లో అధిక ధరలు పెట్టి నాణ్యమైనవి తెప్పిస్తే తరచూ ఇలాంటి సమస్యలు రావనే అభిప్రాయం వ్యక్తం వుతోంది. నిర్వహణ కొరవడి..నగరవ్యాప్తంగా తాగునీటి సరఫరాలో వస్తున్న ఇబ్బందులు, లీకేజీలు, మరమ్మతుల పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా నిర్వహణ ఉండాల్సి ఉండగా కొంతకాలంగా ఇంజినీరింగ్ అధికారులు అటకెక్కించారు. ఫిల్టర్‌బెడ్ నుంచి మొదలుకొని రిజర్వాయర్ల వరకు అత్యవసరంగా పనులు చేసేందుకు కొంతమొత్తం కేటాయించకపోవడం, ఏఈలు, డీఈఈలు సొంతంగా ఖర్చు చేయాల్సి రావడం, ఆ మొత్తం రాబట్టుకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తుంది. దాంతో ఆ ఏఈలు, డీఈఈలు కూడా పట్టనట్లుగా ఉంటున్నారు.కరీంనగర్ కార్పొరేషన్ వివరాలు..డివిజన్లు : 60 జనాభా : 3.50 లక్షలు రిజర్వాయర్లు : 17 నల్లా కనెక్షన్లు : 55,483 రోజూ నీటి సరఫరా : 60 ఎంఎల్‌డీలు పంపిణీ లైను : 315 కి.మీ.మరమ్మతులకు ఆదేశాలిచ్చాం రిజర్వాయర్ల వారీగా లీకేజీలు, వాల్వులు పరిశీలించి మరమ్మతులు చేయాలని ఆదేశించాం. అత్యవసర పనులు, నిర్వహణకు ముందుగానే అంచనాలు తయారు చేసుకోవాలి. ఇబ్బందులు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పాం.

